E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :21 | సోమవారం 22 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## బీజేపీ, కాంగ్రెస్ మధ్య లెటర్ వార్

### రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం సీఎంకు బీజేపీ లేఖ




**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయం ఆసక్తి రేపుతోంది. అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీజేపీ మధ్య లేఖల యుద్ధం సంచలనంగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించడం లేదని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖలు రాస్తుండగా బీజేపీ సైతం అదే స్థాయిలో కౌంటర్ ఇస్తోంది.తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

కిషన్ రెడ్డి వర్సెస్ సీఎం: గత కొంతకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేయడం ఆసక్తిగా మారింది. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టులను తనకున్న పలుకుబడిని ఉపయోగించి అడ్డుకుంటున్నారని సీఎం ధ్వజమెత్తారు.

# తెలంగాణ కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు?

## ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటాపోటీ!

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఈ నెలాఖరుతో చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆయన సర్వీసును మరోసారి పొడగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్టు తెలిసింది. ఇప్పటికే రెండు సార్లు ఆయన పదవీకాలాన్ని కేంద్రం పొడిగించడంతో, మరోసారి ఎక్స్‌టెన్షన్ లభిస్తుందా? లేదా? అనే ఉత్కంఠ నెలకొన్నది. రామకృష్ణారావుకు ఎక్స్‌టెన్షన్ లభించకపోతే.. ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు ముగ్గురు స్పెషల్ సీఎస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది. ఆ జాబితాలో జయేశ్ రంజన్, వికాజ్ రాజ్, సంజయ్ జాజు ఉన్నారు. ఈ ముగ్గురూ 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు. సీనియార్టీలో మొదటి వరుసలో ఉన్న తనకు పదవి కచ్చితంగా వస్తుందని అంచనాలో జయేశ్ రంజన్ ఉండగా, తన సిన్సియార్టీనే తనకు చీఫ్ సెక్రెటరీ పదవి తెచ్చిపెడుతుందని వికాస్ రాజ్ ధీమాలో ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కేంద్ర సర్వీసులో ఉన్న సంజయ్ జాజు సైతం చీఫ్ సెక్రెటరీ పదవిని దక్కించుకునేందుకు ఢిల్లీలోని ఏఐసీసీ నేతల ద్వారా లాబీయింగ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.




# గ్రేటర్‌పై జనసేన గురి

- తెలంగాణపై పవన్ ఫోకస్
- జీహెచ్ఎంసీకి జనసేన సన్నాహాలు
- అలర్ట్ అయిన ప్రధాన పార్టీలు
- సెటిలర్ల ఓట్లపై గురి
- పొత్తులపై జోరుగా చర్చ
- యువ ఓటర్లే లక్ష్యం
- కింగ్‌మేకర్‌గా జనసేన?
- పవన్ ఎఫెక్ట్ ఎంత?
- బీజేపీతో మళ్లీ జట్టు?
- కాంగ్రెస్‌తో మాటల యుద్ధం
- సభ వివాదం రాజకీయ వేడి
- హైదరాబాద్‌లో ఎన్నికల హడావిడి
- బల్దియాపై పార్టీల ఫోకస్
- బహుముఖ పోరుకు రంగం సిద్ధం
- హాట్ టాపిక్‌గా జీహెచ్ఎంసీ పోరు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభంతో జీహెచ్ఎంసీ ఎన్నికల వేడి మొదలైంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సాధించిన ఘనవిజయం ఇచ్చిన ఉత్సాహంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయం పై పూర్తి దృష్టి పెట్టి ఇటీవల మణికొండలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఇప్పట్లో లేనప్పటికీ మరి కొన్ని నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ ను జీహెచ్ఎంసీ , సీఎంసీ, ఎంఎంసీ ఇలా మూడు కార్పొరేషన్లు విభజించడంతో పాటు గతంలో ఉన్న 150 డివిజన్లను 300 లకు పెంచగా ఈ ఎన్నికలను టార్గెట్ చేసి మెజార్టీ కార్పొరేటర్ స్థానాలు గెలుచుకోవడం పైనే పార్టీ అధినేత సమాయత్తం అవుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి . బల్దియాలో బలాన్ని మూటగట్టుకుని శాసనసభ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన లో ఉన్నప్పటికీ ఇప్పటికే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పవన్ కళ్యాణ్ ఎత్తులను ఎలా చిత్తు చేస్తాయనేది చర్చనీయాంశంగా మారింది . హైదరాబాద్ నగర పరిధిలో జనసేన పార్టీ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా లేదా కింగ్ మేకర్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పవన్ కల్యాణ్‌కు ఉన్న క్రేజ్, యువతలో ఉన్న ఆదరణను ఓట్లుగా మలుచుకోవడానికే ముందుచూపుతో సాగుతున్నారని , గ్రేటర్ పరిధిలోని మెజారిటీ స్థానాల్లో కుదిరితే ఏపీ మాధిరిగా పొత్తు, లేకపోతే ఒంటరిగానైనా పోటీ చేసేందుకు పార్టీ సిద్ధమవుతోందని టాక్ వినబడుతోంది. 2020 ఎన్నికల్లో జనసేన సుమారు 60 కి పైగా స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని భావించినప్పటికీ ఆఖరి నిమిషంలో బీజేపీ అగ్రనాయకత్వంతో జరిగిన చర్చల తర్వాత ఓట్లు చీలకూడదనే ఉద్దేశంతో పవన్ కల్యాణ్ తమ అభ్యర్థులను పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. పోటీ నుంచి తప్పుకున్న తర్వాత జనసేన పార్టీ బీజేపీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా నిలవడం తో ఆ పార్టీ ఏకంగా 48 డివిజన్లను గెలుచుకో కలిగింది .

మిగతాది 2 లో..

## కాక్రోచ్ పార్టీ పోరాటానికి రైతుల మద్దతు?


### జంతర్ మంతర్ నుండి సీజేపీ చీఫ్ కీలక పిలుపు




## సగం సినిమా అయిపోయింది: కేటీఆర్




## బీజేపీ నా సీటు చోరీకి పాల్పడింది




**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** బీజేపీ నిర్దాక్షిణ్యంగా తన రాజ్యసభ సీటు చోరీకి పాల్పడిందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భాగంగా ఎస్ఐఆర్‌పై పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అన్నారు.

## నేను హోం మినిస్టర్ కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం..

## లా అండ్ ఆర్డర్‌పై పవన్ ఘాటు వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను హోం మంత్రి కాదని, లా అండ్ ఆర్డర్ తన పరిధిలో లేదని పేర్కొంటూనే, రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేరస్తులను కుల కోణంలో చూడకూడదని, క్రిమినల్స్‌కు కులం ఉండదని స్పష్టం చేశారు.. అయితే, నేను హోం మినిస్టర్ కాకపోవడం.. లా అండ్ ఆర్డర్ తన పరిధిలో లేకపోవడం క్రిమినల్స్ అదృష్టమని పేర్కొన్నారు..

'గుండాలకు గట్టిగా సమాధానం చెబుతాం'

గత రెండేళ్లుగా సహనంగా వ్యవహరించానని చెప్పిన పవన్ కల్యాణ్, ఇకపై గుండాలు, నేరగాళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తానని హెచ్చరించారు. ఒక తల్లి తన బిడ్డ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, బాధితుల హక్కులను కూడా గుర్తించాలని అన్నారు. ప్రతి సంఘటనకు కులాన్ని ముడిపెట్టడం సరైన




విధానం కాదని పవన్ విమర్శించారు. సమాజాన్ని విభజించే కుల రాజకీయాలు రాష్ట్రానికి హానికరమని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ కుల గొడవలను ప్రోత్సహించలేదని, తనను కుల చట్రంలో బంధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

## కులాన్ని తక్కువగా చూడొద్దు వంగా గీత రిక్వెస్ట్




**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఏపీ రాజకీయాల్లో ఇటీవల కుల ప్రస్తావన వినిపిస్తోంది. ముఖ్యంగా కూటమిలో జనసేన పార్టీ ఉండటం, పవన్ కల్యాణ్ కాపు వ్యక్తి కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయన్ను టార్గెట్ చేసింది. దీంతో తనకు కులాన్ని ఆపాదించొద్దని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. తాను ప్రాంతాలకు కూడా అతీతమని బహిరంగ సభల్లోనూ స్పష్టం చేశారు. అయినా సరే వైసీపీ మాజీ నేతలు అమర్‌నాథ్, అంబటి రాంబాబు, వంగా గీత లాంటి వ్యక్తులు పవన్ కల్యాణే టార్గెట్‌గా కుల విమర్శలు చేస్తున్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ మధ్య లెటర్ వార్..

## రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం సీఎంకు బీజేపీ లేఖ

మొదటి పేజీ తరువాయి



ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అంతే ఘాటుగా కిషన్ రెడ్డి సైతం స్పందిస్తున్నారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం రాజకీయాన్ని మరింత రక్తికట్టిస్తున్న వేళ ఇప్పుడు లేఖల రాజకీయం ఇంట్రెస్టింగ్ గా మారింది. మేడిగడ్డ విషయంలో చర్చించేందుకు మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే కిషన్ రెడ్డికి లేఖ రాయగా మొన్న మరోసారి లేఖ రాస్తూ.. ఈసారి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. తాను ఈ నెల 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానని ఆ సమయంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశం కోసం అపాయింట్మెంట్ ఇప్పించాలని కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

ముందు రాహుల్ గాంధీ అపాయింట్మెట్ ఇప్పించు:

కిషన్ రెడ్డిపై లేఖాస్త్రాలు ప్రయోగిస్తున్న వేళ తెలంగాణ బీజేపీ సైతం అంతే స్ట్రాంగ్ గా కౌంటర్ ఇస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇప్పించాలని కోరుతూ సీఎంకు లేఖ రాశారు. కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చేటప్పుడు తప్ప .. తీర్చేటప్పుడు పత్తా లేరా అని ప్రశ్నించారు. 2023 ఎన్నికల్లో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ స్వయంగా తెలంగాణకు వచ్చి ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి? ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులైనా.. మహిళలకు నెలకు రూ.2,500, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000, విద్యార్థులకు విద్యా భరోసా అందలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4,000 భృతి అతీగతీ లేదని వృద్ధులకు రూ.4,000 పెన్షన్ దక్కలేదని విమర్శఇంచారు. ఈ నెరవేరని వాగ్దానాలపై రాహుల్ గాంధీకి వినతిపత్రం ఇచ్చేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని బహిరంగ లేఖ ద్వారా డిమాండ్ చేస్తున్నానని పేర్కొన్నారు. ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం భయపడితే.. అది తెలంగాణ ప్రజలను వారు ఘోరంగా వంచించారని ఒప్పుకున్నట్లేనన్నారు.

# కులాన్ని తక్కువగా చూడొద్దు: వంగా గీత రిక్వెస్ట్

మొదటి పేజీ తరువాయి

కుల ప్రస్తావన చేసిందే పవన్ కల్యాణ్: తాజాగా సైతం కాపు ప్రస్తావన వచ్చేలా మాట్లాడారు. రాజకీయాల్లో చాలాసార్లు కుల ప్రస్తావన చేసిందే పవన్ కల్యాణ్ అని మాజీ మంత్రి అమర్ నాథ్ అన్నారు. భీమవరం, గాజువాక ఎన్నికల సమయంలోనూ కులం అంశాలను పవన్ ప్రస్తావించారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున ఏం మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారని గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు.

మరో నేత అంబటి రాంబాబు సైతం పవన్ కల్యాణ్ పై సెటైర్లు వేశారు. గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన వ్యంగాస్త్రాలు సంధించారు. పవన్ కల్యాణ్ తోలు తీస్తామంటే తీయమనండి చూద్దామని అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు.

కులం పుట్టుకతో వస్తుంది...

పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్‌తో బరిలోకి దిగి ఓడిపోయిన వంగా గీత సైతం విమర్శలు కురిపించార. కులం పుట్టుకతో వస్తుందని, తక్కువగా చూడొద్దని సూచించారు. అధికారంలోకి ఉన్నా లేకపోయినా పవన్ కల్యాణ్ ఒకేలా ఉంటామంటే ఎలా అని వంగా గీత ప్రశ్నించారు. పిఠాపురంలో అన్ని కులాల వారు ఓట్లు వేస్తేనే ఆయన గెలిచారని, ఒక పవన్ కల్యాణ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని వంగా గీత సూచించారు.

# సగం సినిమా అయిపోయింది: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అంతా మాఫియా రాజ్యం నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్‌కు రేవంత్ రెడ్డి అధ్యక్షుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో వేల ఇళ్లు కూల్చేశారని అన్నారు. రేవంత్ రెడ్డికి బూతులు మాట్లాడటం, కేసులు పెట్టడం తప్ప ఏమీ తెలియదని విమర్శించారు. రాష్ట్రం బాగుపడాలి అంటే కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని నినదించారు. మొత్తం తెలంగాణ ప్రజలు అందరూ ఇదే కోరుకుంటున్నారని గుర్తుచేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. ఈ విషయం ప్రజలు అందరికీ తెలిసిపోయి విసుక్కుంటున్నారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సినిమా సగం అయిపోయిందని, ఇంకా సగమే ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి సినిమా అట్టర్ ఫ్లాప్ అని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా ఒక సినిమా ఫెయిలైతే నిర్మాత ఒక్కరే నష్టపోతారు.. కానీ రేవంత్ రెడ్డి సినిమాలో మొత్తం తెలంగాణ ప్రజలు అందరూ నష్టపోతున్నారని అన్నారు. నియోజకవర్గంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఒక్క ఇందిరమ్మ ఇళ్లు అయినా కట్టించారా? అని ప్రశ్నించారు.

# బీజేపీ నా సీటు చోరీకి పాల్పడింది..

## మీనాక్షి నటరాజన్ సెన్సేషనల్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



ప్లాన్ ప్రకారమే తన నామినేషన్ వెంటనే తిరస్కరించారని మీనాక్షి నటరాజన్ ఫైర్ అయ్యారు.

నామినేషన్ తిరస్కరణ విషయంలో తనకు వివరణ కూడా ఇచ్చే సమయం ఇవ్వలేదని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. జార్ఖండ్ లో బీజేపీ అభ్యర్థి పరిమళ్ నత్వాని కి మాత్రం అన్ని విషయాలపై వివరణ ఇచ్చేందుకు టైమ్ ఇవ్వడం అన్యాయం కాదా.. అని ప్రశ్నించారు. ఏదైనా ఫిర్యాదు వస్తే తన వివరణ తీసుకోవాలని, పరిమళ్ నత్వానికి ఒక రూల్, తనకు ఒక రూలా అని మండిపడ్డారు. నారాయణ పేటలో మహిళ ఆరోపణలపై వెంటనే చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళ ఆరోపణల కేసు అప్పుడు ముగిసిపోయిందని తెలిపారు. సిల్లీ రీజన్ చూపి తనకు రాజ్యసభ ఎంపీ రాకుండా చేశారని ధ్వజమెత్తారు. బీజేపీ తన సీట్ చోరీకి పాల్పడిందని, ఎన్నికల కమిషన్ కూడా కాంప్రమైజ్ అయిందని మీనాక్షి నటరాజన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

# కాక్రోచ్ పార్టీ పోరాటానికి రైతుల మద్దతు?

## జంతర్ మంతర్ నుండి సీజేపీ చీఫ్ కీలక పిలుపు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** నీట్ ఎగ్జామ్ అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్?తో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ధర్నా రెండవరోజు కొనసాగుతోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆదివారం సైతం తమ నిరసన కంటిన్యూ చేస్తున్నారు. ఈ సందర్భంగా సీజేపీ పార్టీ చీఫ్ అభిజిత్ దిప్కే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము చేపట్టిన ఈ ఆందోళనకు దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, కార్మికులు మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో రైతులు చేపట్టిన ఆందోళనకు దేశంలోని యువత మద్దతు ఇచ్చిందని ఇప్పుడు మీ పిల్లల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ వైఫల్యం కారణంగా ఇప్పటి వరకు 12 మందికి పైగా పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారని దయచేసి జంతర్ మంతర్ వద్దకు వచ్చి మాకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఢిల్లీలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులంతా ఇవాళ మీ ఆదివారాన్ని ఈ ధర్నా కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు. నీట్ ఎగ్జామ్ అనంతరం విద్యార్థులు సైతం ధర్నాకు అండగా తరలి రావాలన్నారు.

పోలీసులు సహకరించాలి:

సీజేపీ ధర్నాకు శనివారం సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉందని దీంతో వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఢిల్లీ పోలీసులు శనివారం రాత్రి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించే వరకు తాము జంతర్ మంతర్ నుండి కదిలేది లేదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. రాత్రి సమయంలో నిరసన స్థలంలో లైట్లు ఆపేశారని, తాగునీరు, వాష్‌రూమ్ సౌకర్యాలు నిలిపివేశారని ఆందోళనకారులు ఆరోపించారు. ఆ తర్వాత నీటి సరఫరా, విద్యుత్ పునరుద్ధరించినట్లు తెలిపారు. పోలీసులు ప్రజలను ఆందోళన స్థలానికి రాకుండా అడ్డుకోవద్దని, విద్యార్థుల ఆత్మహత్యలకు న్యాయం జరగాలనే తాము శాంతియుతంగా పోరాడుతున్నామని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కోరారు.

27న నిరాహార దీక్ష:

ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఈ నిరసనకు సంఘీభావం ప్రకటించారు. జూన్ 27 లోగా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

# గ్రేటర్‌పై జనసేన గురి

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్ మహానగరంలో అన్ని ప్రతిష్ఠాత్మకంగా భావించే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్లు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కుతుబుల్లాపూర్ , శేరిలింగంపల్లి, కూకట్ పల్లి , ఎల్బీ నగర్ , జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో సెటిలర్లు అధికంగా ఉంటారు. వీటి ఓట్లపై జనసేన గురి పెట్టినట్లుగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఏపీలో మాదిరిగా టీడీపీ, బీజేపీలతో కలిసి నడుస్తారనే టాక్ సైతం వినబడుతోంది . అయితే తమిళనాడు మాదిరిగా పవన్ కళ్యాణ్ సినీ మంత్రం పనిచేస్తుందా? ఇది ఎంతవరకు రాజకీయంగా ఉపయోగపడుతుందనేది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2014లో కేవలం రాజకీయ లాభం కోసమే, పార్లమెంట్ తలుపులు మూసి వేసి, చాలా తొందరపాటుగా, అనాలోచితంగా రాష్ట్రాన్ని విభజించిందని పవన్ కళ్యాణ్ విమర్శించారు. రెండు ప్రాంతాల ప్రజల మధ్య సయోధ్య కుదర్చకుండా విభజించడం వల్లే సమస్యలు వచ్చాయని ఆయన వాదించారు. ఇటీవల ఢిల్లీలో తాను తెలంగాణకు వ్యతిరేకం కాదు, విభజన తీరుకు వ్యతిరేకం అని పవన్ కళ్యాణ్ అన్నారు. వీటి ప్రభావం జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఎంత వరకు ఉంటుంది? అభిమానం ఓట్లు రాలుస్తుందా? పొత్తులు ఎవరెవరితో ఉంటాయి? అనేది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది

సభకు అనుమతి నిరాకరణతో..

ఈ నెల ప్రారంభంలో హైదరాబాద్‌లో జనసేన పార్టీ నిర్వహించాలనుకున్న 'తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ'కు కాంగ్రెస్ ప్రభుత్వం (సైబరాబాద్ పోలీసులు) అనుమతి నిరాకరించడం రెండు పార్టీల మధ్య తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో సుమారు 2 వేల మందితో ఇండోర్ సమావేశం పెట్టాలని జనసేన భావించింది. కానీ శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులను సాకుగా చూపుతూ పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదు. దీనిపై జనసేన కోర్టుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. ఈ పరిణామం తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర స్థాయిలో తెలంగాణ మీ అయ్య సొత్తా అంటూ మాటల యుద్ధం నడిచింది.

పోటీకి సై అంటున్న పార్టీలు..

జీహెచ్ఎంసీలో గతంలో జరిగిన ఎన్నికల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల మధ్య నడిచింది. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఈ పర్యాయం కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ తో పాటు జనసేన , టీడీపీ కూడా పోటీ చేసే అవకాశం ఉండటంతో ఈ పర్యాయం పోటీ హాట్ హాట్ గా, రసవత్తరంగా ఉంటుందనే టాక్ నడుస్తోంది . మొత్తం హైదరాబాద్ మహానగరంలో క్రమంగా జీహెచ్ఎంసీ ఎన్నికల వేడి రాజుకుంటుండగా ఓటర్లు కూడా అన్ని పార్టీలను ఆసక్తిగా గమనిస్తున్నారు.

# తెలంగాణ కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు?

## ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటాపోటీ!

మొదటి పేజీ తరువాయి



చాలా ఏండ్లుగా కేంద్ర సర్వీసులో పనిచేస్తోన్న జాజుకు రాష్ట్ర రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై అవగాహన తక్కువగా ఉంటుందని చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. ప్రస్తుతానికి ఎవరికి వారే తమకు పదవి వస్తుందనే ధీమాలో ఉండగా, వచ్చేవారం కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు అనే అంశంపై క్లారిటీ వస్తుందని సీఎంవో వర్గాలు తెలిపాయి.

రామకృష్ణారావుకు బంఫరాఫర్

కేంద్ర ప్రభుత్వం చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు పదవీకాలాన్ని మరోసారి పొడిగించకపోతే ఆయన సేవలను ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. అందులోభాగంగా ఆయనకు హైదరాబాద్ మెట్రోరైలు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కేఆర్కేకు ఆఫర్ ఇచ్చినట్టు రాజకీయవర్గాల్లో డిస్కషన్ జరుగుతున్నది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతున్నది. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకు కావాల్సిన నిధుల సమీకరణ చాలా కీలకం. రామకృష్ణారావుకు చాలా కాలం పాటు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలు చూసిన అనుభవం ఉంది. కేంద్ర ప్రభుత్వంలోని అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీనితో ఆయన ఎక్కువ వడ్డీతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసుకున్న సుమారు రూ. 25 వేల కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి, ఎక్కువ ఏండ్ల పాటు చెల్లించే విధంగా రీ-షెడ్యూలు చేయించడంలో కీలక పాత్ర పోషించినట్టు టాక్ ఉంది. దీనితో మెట్రో రైలు విస్తరణ కోసం కావాల్సిన నిధుల సమీకరణ ప్రక్రియలో ఆర్థిక రంగంలో అనుభవం ఉన్న రామకృష్ణారావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుదని ఆలోచనలో రేవంత్ రెడ్డి ఉన్నట్టు తెలిసింది.

# నేను హోం మినిస్టర్ కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం..

## లా అండ్ ఆర్డర్‌పై పవన్ ఘాటు వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

అధికారులపై ప్రత్యేక దృష్టి: వైసీపీ పట్ల విధేయత చూపుతున్న అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతానని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇప్పటి వరకు కొన్ని అంశాల్లో మౌనం పాటించానని, ఇకపై ప్రజల ముందే తన అభిప్రాయాలను వెల్లడిస్తానని తెలిపారు. మరోవైపు.. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు మరింత చురుకుగా వ్యవహరించాలని పవన్ సూచించారు. ప్రతి సమస్యకు తాను వ్యక్తిగతంగా వెళ్లడం సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై పార్టీ ప్రజాప్రతినిధులు ముందుండాలని పిలుపునిచ్చారు.

తప్పుడు అట్రాసిటీ కేసులపై ఆందోళన

తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిరోధించాల్సిన అవసరం ఉందని పవన్ అభిప్రాయపడ్డారు. కొన్ని కేసుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, సుగాలి ప్రీతి, వైఎస్ వివేకానంద రెడ్డి కేసులను ప్రస్తావించారు.. లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి.. రూల్ ఆఫ్ లా బలంగా నిలబెట్టాలి.. కులాలకు.. మతాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు లాండ్ ఆర్డర్ కి ఎందుకు ఉండవు? అని ప్రశ్నించారు.. సమాజాన్ని బలహీనపరచడానికి రాలేదు.. గుండాల తొక్కి నార తీస్తా.. రెండేళ్లుగా చాలా సహనంగా ఉన్నాను అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# ప్రపంచానికి యోగా భారత్ ఇచ్చిన కానుక

## ప్రధాని నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచంలోని ప్రతి ఒక్కరినీ ఏకం చేస్తుందని, మెరుగైన భవిష్యత్తు కోసం మానవతా దృక్పథం ఎంతో అవసరమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్ వేదికగా జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే స్పెషల్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మైదానంలో హాజరైన వేలాది మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేశారు.

ఆ శక్తి యోగాకు ఉంది..

అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యోగా అనేది కేవలం కొన్ని శారీరక వ్యాయామాల కలయిక మాత్రమే కాదని, అది మానవ ఆత్మ యొక్క అత్యున్నత అభివ్యక్తి అని ప్రధాని కొనియాడారు. అది మనసుకు, శరీరానికి మధ్య సమతుల్యతను చేకూరుస్తుందని తెలిపారు. జాతి, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా ప్రపంచంలోని ప్రతి ఒక్కరినీ అనుసంధానించే అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రధాని పేర్కొన్నారు. విశ్వశాంతికి, మానవాళి సంక్షేమానికి ఇది ఒక వారధిలా పనిచేస్తుందని ప్రధాని అన్నారు. ఈ ఏడాది థీమ్ అయిన ఆరోగ్యకరమైన వృద్ధాప్యం గురించి చెబుతూ.. మారుతున్న జీవనశైలిలో వయసు పైబడిన వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి యోగా ఎంతో దోహదపడుతుందని వివరించారు. భారతదేశ సంస్కృతిలో భాగమైన యోగాను నేడు ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి తీసుకురావడం మనందరికీ గర్వకారణమని ప్రధాని మోడీ ఆనందం వ్యక్తం చేశారు.

# 2 రోజుల పాటు ఢిల్లీలోనే సీఎం రేవంత్..

## మెట్రో, రైల్వే అంశాలపై కేంద్రంతో చర్చలు!



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన మెట్రో విస్తరణ, రైల్వే పెండింగ్ అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నేరుగా చర్చించి, సమస్యలను తేల్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా ఆయన రాబోయే రెండు రోజుల పాటు హస్తినలోనే పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే టార్గెట్‌గా కేంద్రం నుంచి నిధులు, అనుమతుల సాధన కోసం సీఎం ఈ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే, టూర్‌కు ముందే సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక లేఖ రాశారు. ఈనెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలోనే అందుబాటులో ఉంటానని లేఖలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే మంత్రితో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయించాలని, అందుకు కిషన్ రెడ్డి చొరవ చూపాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఐఆర్ఎఫ్సి ఫైనాన్సింగే ప్రధాన అజెండా..

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్‌లో భాగంగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన నిధుల కొరతపై చర్చించనున్నారు. అదేవిధంగా ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఫైనాన్సింగ్ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు. మెట్రో ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వివిధ రైల్వే లైన్ల విస్తరణ, కొత్త రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై పూర్తి వివరాలతో కూడిన రిపోర్టును సీఎం రేవంత్, కేంద్ర మంత్రులకు అందజేయబోతున్నట్లుగా తెలుస్తోంది.

## అమ్మ మాట -- అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో

# చిన్నారులకు అక్షరాభ్యాసం"

## అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు"

**సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 21(తెలుగుగళం) న్యూస్ :**







అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా అయ్యగారిపేట మొదటి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిడిపిఓ సత్యవతి, సెక్టార్ సూపర్వైజర్ యు.మహాలక్ష్మి లు పాల్గొన్నారు.చిన్నారుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలకు అక్షరాలు, సంఖ్యలు, రంగులు, ఆకారాల గుర్తింపు, చేతుల శుభ్రత (హ్యాండ్‌వాష్) వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. అలాగే చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా వివిధ ఆటలు, విద్యా కార్యకలాపాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య అందించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులు,చిన్నారులు,టీచర్స్ శ్రీపాటి స్వాతి,కె.అరుణ, తామారు, కె.మంగతయారు,ఆశా వర్కర్స్ సువర్ణ,రాధ,హెచ్ వి శారా,ఏ ఎన్.ఏం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### వధూవరులను ఆశీర్వదించిన
# మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**తెలుగు గళం ఆత్మకూరు జూన్ 21 :**



హౌజ్ బుజుర్గు గ్రామంలో శనివారం జరిగిన గోపరబోయిన అఖిల్ – శిరీషల వివాహ వేడుకకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆయన వెంట నాయకులు ముత్యాల మహేందర్, గుండెబోయిన బాలకృష్ణ గౌడ్, గుండెబోయిన రాజు, నేరెళ్ల రాజు, బొమ్మగాని రాజు, అనిల్, అఖిల్, దొడ్డిపాక రాజన్న, సయ్యద్ జాను, గోపరబోయిన రవి, దుప్పటి శంకర్, నీలం కుమార్, అజ్మత్, అజయ్ గౌడ్, మార్క శివ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో 'రాజ్యాధికార సమరభేరి' సభ పోస్టర్ ఆవిష్కరణ

## బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న పోరాటం-తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం, బహుజనుల రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా తీన్మార్ మల్లన్న నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ స్పష్టం చేశారు. వచ్చే జూలై 5వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు సంబంధించిన అధికారిక వాల్ పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన అంబేద్కర్ సెంటర్ వద్ద ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఎందరో అమరవీరుల త్యాగాలు, ఆకాంక్షల ఫలితంగా సిద్ధించిందని, అయితే నేడు ఆ రాష్ట్రం బహుజనుల చేతుల్లో కాకుండా కేవలం కొద్దిమంది పెత్తందార్ల చేతుల్లో నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగుతున్న రెడ్డి, వెలమ సామాజికవర్గాల ఆధిపత్య రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకోసమే బహుజన వర్గాలకు స్వయం పాలనా అధికారం సాధించేందుకు "రాజ్యాధికార సమరభేరి" మోగించాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయిలో అత్యుత్తమ ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందాలన్నదే తమ పార్టీ ప్రధాన ఆశయమని రవి పటేల్ పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పులు రావాలంటే బహుజనుల చేతుల్లోకి అధికారం రావాలని, ఆ దిశగా ప్రజల్లో చైతన్యం నింపేందుకే ఈ మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే జూలై 5న జరగబోయే ఈ చారిత్రాత్మక రాజ్యాధికార సమరభేరి సభకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, మండలాల నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు, మేధావులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని పోరాటానికి తమ పూర్తి మద్దతును తెలియజేయాలని ఆయన హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిష్టాత్మక పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ముఖ్య నాయకులు మోటపోతుల సమ్మయ్య, మడే సంతోష్, జినుకల శ్రీను, అశోక్, కృష్ణ ప్రశాంత్, శ్రీపతి, భద్రయ్య, రంజిత్, మోహన్,పార్టీ వివిధ అనుబంధ సంఘాల కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ఆరోగ్యానికి ఒక అడుగు -- యోగాకు ఒక అడుగు"
## - ప్రజలకు సీఆర్పీఎఫ్ పిలుపు



**తెలుగు గళం న్యూస్, ఎటపాక, జూన్ 21**

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలోని 212 బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ ఏడాది యోగా దినోత్సవం థీమ్(ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా)గా నిర్వహించారు.ఉదయం 6:30 గంటలకు జరిగిన కార్యక్రమాన్ని 212 బెటాలియన్ కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ ప్రారంభించారు. యోగా సాధన ద్వారా వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా, చురుకుగా, గౌరవప్రదమైన జీవనం గడపవచ్చని ఆయన పేర్కొన్నారు. యోగా ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేర్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మెడ, భుజాలు, మణికట్టు, మోకాళ్లకు సంబంధించిన సూక్ష్మ వ్యాయామాలతో పాటు వృక్షాసనం, తాడాసనం వంటి యోగాసనాలు నిర్వహించారు. అలాగే అనులోమ-విలోమ, భ్రమరి, ఉజ్జయి వంటి ప్రాణాయామాలను అభ్యసించారు. ఇవి మానసిక ప్రశాంతతను పెంపొందించడంతో పాటు రక్తపోటు నియంత్రణకు దోహదపడతాయని అధికారులు వివరించారు.కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు, స్థానిక గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు."ఆరోగ్యానికి ఒక అడుగు -- యోగాకు ఒక అడుగు" అంటూ సీఆర్పీఎఫ్ ప్రజలకు పిలుపునిచ్చింది.

# తక్షణమే 20 వేల పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేయాలి

## సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వాంకుడోత్ అశోక్ నాయక్ డిమాండ్




## నిరసనలకు సిద్ధమైన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు

**తెలుగు గళం న్యూస్ హనుమకొండ**

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న ప్రస్తుత పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా 20 వేల సబ్-ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వాంకుడోత్ అశోక్ నాయక్ డిమాండ్ చేశారు.ఆదివారం హనుమకొండ జిల్లా పరిధిలోని కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులు, నిరుద్యోగ యువకులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ముందు నిరుద్యోగుల అండతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. నేడు వారి జీవితాలతో చదరంగం ఆడుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎలాంటి పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు వయోపరిమితి దాటిపోయి, ఉపాధి అవకాశాలు కోల్పోతూ తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది నిరుద్యోగ యువకులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం కేవలం 5,000 పోస్టులతో సరిపెట్టాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని, ఇది నిరుద్యోగులను తీవ్రంగా వంచించడమేనని అశోక్ నాయక్ మండిపడ్డారు. ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉన్నప్పుడు కేవలం ఐదు వేల పోస్టులు ఇస్తే ఎవరికి సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. ఈ తూతూమంత్రం నోటిఫికేషన్ ఆలోచనను విరమించుకుని, ఖాళీగా ఉన్న 20 వేల పోలీస్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, గత నాలుగేళ్లుగా నోటిఫికేషన్లు లేని కారణంగా నష్టపోయిన అభ్యర్థుల కోసం వయోపరిమితిలో ఐదు సంవత్సరాల సడలింపును తక్షణమే జీవో ద్వారా ప్రకటించాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.ప్రభుత్వం గనుక తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించని యెడల, సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో నిరుద్యోగులను, విద్యార్థులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున "రాస్తారోకో" (రహదారుల దిగ్బంధం),ఉధృత పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీకి చెందిన పలువురు విద్యార్థి నాయకులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు,నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

## సమయస్ఫూర్తితో ట్రాఫిక్‌ను పునరుద్ధరించిన రేగొండ కానిస్టేబుల్స్ పృథ్వీరాజ్,అరుణ్ కుమార్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఒక భారీ వృక్షం అకస్మాత్తుగా కుప్పకూలింది.రహదారికి ఇరువైపులా చెట్టు కొమ్మలు దట్టంగా విస్తరించి పడిపోవడంతో,హైవేపై వెళ్లే వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి తీవ్ర అంతరాయం ఏర్పడింది.సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు,వాహనదారులు ఏం చేయాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో.. రేగొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు పృథ్వీరాజ్,అరుణ్ కుమార్ అత్యంత అప్రమత్తతతో,సమయస్ఫూర్తితో స్పందించారు. రహదారిపై చెట్టు కూలిన విషయాన్ని గమనించిన వెంటనే వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేచి చూడకుండా, తక్షణమే రంగంలోకి దిగి స్థానిక గ్రామస్తులను, యువకులను సమన్వయం చేసుకున్నారు.ట్రాఫిక్ మరింతగా స్తంభించిపోకుండా ఉండేందుకు స్థానికుల సహాయంతో ఒక ట్రాక్టర్‌ను అత్యవసరంగా రప్పించారు.స్వయంగా కానిస్టేబుళ్లు ఇద్దరూ ముందుండి,భారీ వృక్షానికి ఉన్న పెద్ద కొమ్మలను గొడ్డళ్లతో నరికి, వాటిని ట్రాక్టర్‌కు గట్టిగా కట్టి రహదారిపై నుండి పక్కకు లాగించి తొలగించారు. దాదాపు గంటకు పైగా శ్రమించి యుద్ధప్రతిపాదికన చెట్టు కొమ్మలన్నింటినీ రోడ్డుపై నుండి క్లియర్ చేయడంతో,జాతీయ రహదారిపై నిలిచిపోయిన రవాణా వ్యవస్థ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంది. వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆపద సమయంలో ఎంతో బాధ్యతగా, ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించిన కానిస్టేబుళ్లు పృథ్వీరాజ్, అరుణ్ కుమార్‌ల చాకచక్యాన్ని, సేవా నిరతిని కొత్తపల్లి గ్రామ ప్రజలు, వాహనదారులు ముక్తకంఠంతో ప్రశంసించారు. తోటి పోలీసు సిబ్బందితో పాటు, రేగొండ సబ్-ఇన్స్పెక్టర్ దాసరి సుధాకర్ కూడా కానిస్టేబుళ్ల తక్షణ స్పందనను, అంకితభావాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చారని కొనియాడారు.



# రైతుల అభ్యున్నతికి కృషి - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
## - ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్**

మల్కారం గ్రామ పంచాయతీ గుత్తావారిగూడెం గ్రామంలో ఆయిల్ ఫామ్ రైతుల నిర్వహించిన ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ రైతులు ఈ ద్వారా లాభసాటి దిగుబడులు సాధిస్తూ ఆర్థికంగా బలోపేతం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ రైతులకు గిట్టుబాటు ధరలు మార్కెటింగ్ సౌకర్యాలు రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారని రైతుల ఆదాయాన్ని



పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు ఆయిల్ ఫామ్ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి మరింత అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

# యోగ శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది

## -- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్**





భద్రాచలం ఐటిడిఎ లో యోగాసనం భారతీయుల అమూల్య సంపదని, దీనిలోని విశేషమైన ఆరోగ్య రహస్యాలు తెలిసిన ప్రపంచ దేశాలన్నీ దీనిని ఆచరించి లబ్ధిపొందుతున్నాయని, యోగ మన శారీరక మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం ఆవరణలో యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఐటీడీఏ యూనిట్ అధికారులు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల బాల బాలికలు మరియు ఇతర సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ప్రతిరోజు మనం చేసే దయానందన కార్యక్రమాలలో నిత్య కృత్యంగా యోగాసనం చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి మెదడుకు శక్తిని ఇస్తుందని, జీవన క్రియలను మెరుగుపరిచి రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులను దూరం చేస్తుందని, జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని, శ్వాసక్రియను మెరుగుపరిచి శరీరం అంతటికి చక్కటి ప్రాణవాయువుతో కూడిన మెరుగైన రక్తప్రసరణకు తోడ్పడుతుందని, సంక్షేమ శాఖలో పనిచేసే హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులు ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థిని విద్యార్థులకు యోగాసనంలో ముఖ్యమైన ఆసనాలు చేయించి వారి మేధాశక్తిని పెంపొందించుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యంగా లేని మనిషి జీవితంలో ఏదీ సాధించలేడని, శాంతంగా ఉన్న వారే జీవితంలో ఏమైనా సాధించగలరని, యోగా అనేది మన మనసుకు మన ఆత్మని శరీరాన్ని ఏకం చేసే ఒక మహోన్నత సాధనం అనంతరం ఐటీడీఏ పీవో బి రాహుల్ సిబ్బంది సమక్షంలో యోగా గురువు గుమలాపురం సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎస్ డి సి ఆనంద కుమార్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీధర్, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, ఏఒ సున్నం రాంబాబు, ఏ టి డి ఓ అశోక్ కుమార్, ఏ సి ఎం ఓ రమేష్ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు,ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల విద్య, ఉపాధి, సంక్షేమ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

## -- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్"
## యాదవ్‌ను కలిసిన బీసీ జేఏసీ కో-కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్"



**హైదరాబాద్, జూన్ 21(తెలుగుగళం) న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారబోయిన రఘునాథ్ యాదవ్ ని బీసీ జేఏసీ కో-కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూనె హరిబాబు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవ సామాజిక వర్గం సమగ్ర అభివృద్ధికి యాదవ కార్పొరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా యాదవ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యా ప్రోత్సాహం, విదేశీ విద్యా సహాయం, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా యాదవ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, గొర్రెలు--పశుసంవర్ధక రంగాలకు ప్రోత్సాహక పథకాలు విస్తృతంగా అమలు చేసి యాదవ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని కోరారు.దీనిపై స్పందించిన మారబోయిన రఘునాథ్ యాదవ్ యాదవ సమాజ విద్యా, సామాజిక, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రతి లబ్ధిదారునికి కార్పొరేషన్ ద్వారా ప్రయోజనాలు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో: యాదవ సమాజ అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ, యువత ఉపాధి, స్వయం ఉపాధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్

హైదరాబాద్: ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్ చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2,232 మందికి చెందిన రూ.21.91 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి రూ.6.83 కోట్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు రికవరీలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు నుంచి ఇప్పటివరకు 59,953 మంది బాధితులకు రూ.445.41 కోట్లు రిఫండ్ అయినట్లు తెలిపారు. 2026లో జూన్ 20 వరకు రూ.70.07 కోట్లు సైబర్ మోసగాళ్ల నుంచి రికవరీ చేసినట్లు వివరించారు. యూపీఐ, ఇన్వెస్ట్‌మెంట్, ఇంపర్సనేషన్ స్కామ్‌ల బాధితులకు వేగంగా న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్/ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

## మసీదుబండలో పైప్‌లైన్ పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి,జూన్ 21 (తెలుగు గళం న్యూస్)**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండ ప్రధాన రహదారిపై పైప్‌లైన్ దెబ్బతినడంతో చేపడుతున్న మరమ్మత్తు, పునరుద్ధరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా గౌరవ యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జలమండలి అధికారులు, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల సమస్య తలెత్తిందని తెలిపారు.మరమ్మత్తు పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మాధవ హిల్స్, శిల్ప వ్యాలీ కాలనీలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనితీరు, నిర్వహణ, అభివృద్ధి అవసరాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు సందీప్, లోకేష్, ఇంజనీరింగ్ అధికారులు ఆనంద్, భాస్కర్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, జనార్ధన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, కోడిచెర్ల రాములు, మల్లేష్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గపాడు ఫుడ్ పార్క్‌పై బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం"

### అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను ప్రజలు నమ్మొద్దు"

### రుజువులతో చర్చకు రావాలి: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి"

**సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 21 (తెలుగుగళం)న్యూస్:**

బుగ్గపాడు ఫుడ్ పార్క్ అంశంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి మాట్లాడారు.

బుగ్గపాడు ప్రాంతం గిరిజనులు అధికంగా నివసించే వెనుకబడిన ప్రాంతమని, అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి జలగం వెంకటరావు హయాంలో రైతుల నుంచి భూములు సేకరించి రూ.109 కోట్లతో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పార్క్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పరిశ్రమలను తీసుకురాక అభివృద్ధిని నిలిపివేసిందని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఫుడ్ పార్క్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టి పరిశ్రమలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏర్పాటైన పరిశ్రమలు మూతపడటంతో యంత్రాలు తుప్పుపట్టి పాడవుతున్నాయని, కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా కావడం బాధాకరమన్నారు.

దీపక్ సంస్థ ప్రతినిధులు పరిశ్రమ స్థాపనకు ముందుకొచ్చి 2,500 నుంచి 3,000 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రతిపాదించారని వెల్లడించారు. సంబంధిత శాఖలు, కమిటీలు పరిశీలించి భూమి ధరను స్క్వేర్ మీటరుకు రూ.615.75గా, ఎకరాకు సుమారు రూ.25 లక్షలుగా నిర్ణయించాయని వివరించారు. అన్ని అనుమతులు పొందిన తరువాతే పరిశ్రమ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగిందని స్పష్టం చేశారు.



పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క శాశ్వత పరిశ్రమను కూడా తీసుకురాలేని నాయకులు నేడు అభివృద్ధి కార్యక్రమాలపై బురదజల్లడం దురదృష్టకరమని ఎమ్మెల్యే రాగమయి మండిపడ్డారు. ఈ నెల 24న జరగనున్న కేటీఆర్ సభలో ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు తీసుకురావాలని, ప్రజల సమక్షంలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

అవినీతి, అక్రమాలు జరిగాయని నిరూపించే రుజువులు ఉంటే బహిరంగంగా బయటపెట్టాలని, లేకుంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నిలిపివేయాలని హెచ్చరించారు. పామ్ ఆయిల్ రిఫైనరీ యూనిట్ ఏర్పాటు విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగానే ఉందని, అవసరమైన ముడిసరుకు, సాగు విస్తీర్ణం లభిస్తే పరిశ్రమలు తప్పకుండా వస్తాయని తెలిపారు.

సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికల ద్వారా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని, వాస్తవాలు తెలుసుకుని మాత్రమే సమాచారం ప్రచారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల భవిష్యత్తుతో ఆటలాడవద్దని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు.

## న్యూ స్టార్ హాస్పిటల్ బ్లాక్ ప్రారంభించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి"

### 18వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన.. కాంగ్రెస్ నాయకులతో భేటీ"

సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 21 (తెలుగుగళం)న్యూస్: సత్తుపల్లి పట్టణంలోని యూపీఎస్ హాస్పిటల్ రోడ్డులో డాక్టర్ సురేష్ రామాల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన న్యూ స్టార్ హాస్పిటల్ బ్లాక్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి





తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ లు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

తదుపరి పట్టణంలోని 18వ వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించిన మంత్రి, ఎమ్మెల్యే డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకొని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి



చేయాలని ఆదేశించారు.

అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ నరసింహారావు నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు.

ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా నది హారతి

**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్**



భద్రాచలం ప్రజలు, భక్తుల ఆదరాభిమానాలతో గోదావరి నదిహారతి పురోహితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని రామ వజ్జల రవికుమార్ అన్నారు. పరాభవ నామ సంవత్సరం శుద్ధ సప్తమి సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలం లోని గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో ఈరోజు జరిగే నదిహారతికి ఒక విశిష్టత ఉందని నిజ జేష్ఠ మాసం శుద్ధ సప్తమి ఆదివారం సూర్యభగవానునికి, సూర్య వంశమునకు చెందిన శ్రీరామచంద్రుడికి కూడా విశేషమైన గోదావరి నదికి హారతులు సమర్పించడం మంగళ ప్రధానమైనదని, శ్రీ సీతారామనుగ్రహం పుణ్య గోదావరి శుభాశీస్సులతో ప్రజలకు సకల శుభాలు కలుగుతాయని, భక్తులకు తెలిపిన అనంతరం సాయంత్రం 6:30 గంటలకు జైశ్రీరామయ నమః అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన అనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతి ఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పురోహితులు రామాచార్యులు, తేజశర్మ, సత్య ప్రసాద్ శర్మ, సుబ్రహ్మణ్యాచార్యులు, వీరభద్ర శర్మ, అశోక్ కుమార్ శర్మ, శివ మరియు స్వచ్ఛంద సంస్థలు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఇంట్లో ఆనందపు హరివిల్లులు విరబూయాలి

### రైతు కోసం మహాయజ్ఞం దేశ చరిత్రలో ఇదో మైలు రాయి

### లోకానికి అన్నం పెట్టే రైతు కళ్ళల్లో కన్నీళ్లు రాకుండా చూద్దాం

### మంత్రి తుమ్మలకు భూవరాహ యజ్ఞ ఆహ్వానం

### -- డా కృష్ణ చైతన్య స్వామి

**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్ :**

కల్ప వృక్ష నారసింహస్వామి వారి దివ్య సన్నిధిలో నృసింహ ఉపాసకులు డా. కృష్ణ చైతన్య స్వామి వారి ఆధ్వర్యంలో 32 దివ్య క్షేత్రాల నుండి తెచ్చిన మట్టికి 32 రోజుల కాలం ప్రత్యేక పూజలు చేసి జూన్ 25 నుండి 27 వరకు మూడు రోజుల కాలం పాటు భూ వరాహ యజ్ఞాన్ని నిర్వహించి ఆ మృత్తికాప్రసాదాన్ని రైతులకు అందించనున్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కి భువరాహయజ్ఞ ఆహ్వాన పత్రికను అందించి రైతు శ్రేయస్సు కోసం జరిగే యజ్ఞరాజానికి తప్పనిసరిగా రావాలని డా. కృష్ణ చైతన్య స్వామి వారు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా చైతన్య స్వామి మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుందని గత పది సంవత్సరాలుగా ఏరువాక పౌర్ణమి నాడు రైతన్నలను సన్మానించి వారికి మృత్తికా ప్రసాదాన్ని అందిస్తున్నామని ఈ మట్టి ప్రసాదాన్ని పంట పొలాలలో చల్లడం ద్వారా సమృద్ధిగా పంటలు పండుతాయని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడవు పంటలు పండవు అని ఎంతో మంది రైతులు లేని పోని అపోహలతో ఇప్పటికే ఆలోచనలో పడ్డారని అందుకే లోకానికి అన్నం పెట్టే రైతన్న సుభిక్షంగా ఉండాలనే మహా సంకల్పంతో చేస్తున్న

ఈ భూవరాహ యజ్ఞంలో ప్రతి ఒక్క రైతు పాల్గొని స్వామివారి దివ్య సన్నిధిలో ఇచ్చే మృతిక ప్రసాదాన్ని



స్వీకరించి తమ తమ పంట పొలాలలో జల్లుకొని సిరుల పంటలు పండించుకుని రైతన్నలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. గత 10 సంవత్సరాలుగా ఏరువాక పౌర్ణమి నాటికి కొన్ని వేల మంది రైతులు ఆ మట్టి ప్రసాదాన్ని తమ తమ పంట పొలాలలో జల్లుకుని ఎంతో వృద్ధిలోకి వచ్చారని ఈ సంవత్సరం లక్ష మంది రైతులకు ఆ మృత్తిగా ప్రసాదాన్ని అందించనున్నామని ఇంతటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన డా. కృష్ణ చైతన్య స్వామికి రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నృసింహ ఉపాసకులు డా. కే.కృష్ణ చైతన్య స్వామి టి పి సి సి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు రైతులు తదితరులు పాల్గొన్నారు

## టీయూఎఫ్ వేంసూరు మండల నూతన కమిటీ ఎన్నిక"

### మండల అధ్యక్షుడిగా మేడా విజయ్‌బాబు ఎంపిక"



వేంసూరు, జూన్ 21 (తెలుగుగళం): తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (టీయూఎఫ్) సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండల నూతన కమిటీని ఆదివారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో గల షిర్డీ సాయిబాబా ఆలయ మంటపంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర సీనియర్ నాయకులు బండి అంజిరెడ్డి, మండల సీనియర్ నాయకుడు మోరంపూడి చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ఎన్నిక చేపట్టారు.ముందుగా వేరు తెలంగాణ పోరాటంలో అమరులైన వారికి సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన రైతు మేడా విజయ్ బాబు మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రేగళ్ల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మర్లపాడు గ్రామానికి చెందిన గంద్ర జగన్మోహన్‌రెడ్డి, కోశాధికారిగా దుద్దేపూడి గ్రామానికి చెందిన మిరియాల రాజును ఎన్నుకున్నారు. సభ్యులుగా కనకపూడి రవి, మేకల వెంకటేశ్వర్లు, భూసమ్మ తదితరులను ఎంపిక చేశారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.ఎస్.రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుంట్రు రామకృష్ణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి కిన్నెర వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ హబీబ్, కార్యదర్శి మోరంపూడి అజయ్ ఘోష్ అభినందించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, ఉద్యమ ఆకాంక్షల సాధన, సామాజిక న్యాయం కోసం టీయూఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన వారికి ఎల్ ఎస్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల అధ్యక్షుడు వాసం దాసు, కల్లూరు మండల అధ్యక్షుడు దోమతోటి పాకీర్‌తో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేస్తాం

### : టి. యు.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు(ఎల్ ఎస్ రెడ్డి)"

### 15వ వర్ధంతి సందర్భంగా జయశంకర్ సార్‌కు ఘన నివాళులు"



వేంసూరు, జూన్ 21 (తెలుగు గళం) న్యూస్: తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (టీయూఎఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 15వ వర్ధంతిని సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల మర్లపాడు గ్రామ రింగ్ సెంటర్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న టియుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకినేని శేఖర్ రెడ్డి(ఎల్.ఎస్.రెడ్డి) మాట్లాడుతూ జయశంకర్ సార్ చూపిన బాటలో తెలంగాణ పునర్నిర్మాణం, తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సమానత్వం, స్వాభిమానంతో కూడిన సమాజ నిర్మాణమే జయశంకర్ సార్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. "జయశంకర్ సార్ ఆశయాలే మా దిక్సూచి.. తెలంగాణ ఉద్యమ లక్ష్యాల సాధనే మా ధ్యేయం" అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో: ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు గుంట్రు రామకృష్ణ,ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి కిన్నెర వెంకటేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ హబీబ్, కార్యదర్శి మోరంపూడి అజయ్ ఘోష్, సత్తుపల్లి మండల అధ్యక్షుడు వాసం దాసు, కల్లూరు మండల అధ్యక్షుడు దోమతోటి పకీర్,వేంసూరు మండల కార్యకర్తలు పాల్గొన్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.